
కథ



# బతకనేర్చినవాళ్ళు

◆ ఇంద్రగంటి శ్రీనివాసశాస్త్రి

illustration: akbar

సందెవేళ ఆకాశంలో రంగులు గబగబ మారుతున్నాయి - పార్టీ మార్చిన రాజకీయ నాయకుడి అభిప్రాయాల్లా.

భూషణం కారు భుజంగం ఇంటిముందు ఆగింది.

''ఏవయ్యా! ఈమధ్య మరీ నల్లపూసై పోయావు. నీ సినిమా యాపారం ఎలా వుంది? రా! లోపలకు రా!'' అంటూ సాదరంగా ఆహ్వానించాడు భుజంగం.

భుజంగం ఎవరనుకున్నారు? లోకల్ పాలిటిక్స్‌లో 'చాకులు నూరిన యోధుడు'. ప్రస్తుతం 'అఖిల భారత సైబర్ కుటీర సంఘం' అధ్యక్షుడు. భూషణం విసుగు చెందని చిత్రమార్కుడు. ఏడాదికో సినిమా తీసి, ఎప్పటికీ రాని 'ఆస్కారు' కోసం ఎదురుచూస్తుంటాడు.

''ఈరోజుల్లో సినిమా యాపారం 'మూడు సోపులు, ఆరు ఫ్లాపుల్లా' వుంది మావా! అయినా, పాలిటిక్స్‌లో చేరాక నీ పనే బావుంది. కడుపు కదల్చకుండా కూర్చున్నావు..'' (ఈ సోఫాలో కూర్చుంటే, భుజంగం బొజ్జ ఆ సోఫాలో వుంటుంది. ఇంకేం కదుల్తాడు చెప్పండి)... ''అసలు, పాలిటిక్స్‌లో చేరాలని నీకెలా బుద్ధిపుట్టిందయ్యా?''

''అడిగావూ? అయినా, ఇదేం పెశ్నయ్యా? మొన్న ఇదే కొశ్చను మా అమ్మాయి ఏసింది. అది కాలేజీలో చదూకుంటోంది, ఏదో ఎర్రి బాగుల్దిలే, అడిగిందనుకున్నాను. ఇదేటిది? రేపో, మాపో పార్లమెంటు కెళ్ళాల్సినోడివి. నువ్వడిగితే నేనేటనుకోవాల? అసలు, నేనోటడుగుతాను, చెప్పోరే. విదేశీయులు కూడా మన 'కట్టు-తిట్టు' నేర్చి మన రాజకీయాల్లో దూరిపోయి, పెజాసేవకోసం తహతహలాడుతూ వుంటే, ఇదేటిది, మన చేతిలోని విద్య, మనం ఎలా ఒదిలేసుకుంటాం'' - అంటూ పెద్ద చుట్ట నోట్లో పెట్టి వెలిగించాడు.

'ఐదే, నువ్వు పెజాసేవ చెయ్యడానికే పాలిటిక్స్‌లోకి దిగానంటావ్''

''నువ్వలాగనుకుంటే, ఎమ్మెల్యే కూడా కాకుండానే పెజాసేవ చేసేసిన ఎల్లయ్య కత చెప్తా యిను'' అంటూ భుజంగం కత మొదలెట్టేశాడు.

''.... ఎల్లయ్యకి పదేళ్ల కిందట ఒక్క సారాయి కొట్టు మాత్రమే వుండేది. ఓసారి ఎలచ్చన్లొచ్చాయి. అప్పుడు 'జంతర్ మంతర్' పార్టీ రూలింగ్‌లోకొస్తాదని అందరికీ తెలుసు. మనవాడెళ్ళి సరాసరి ఆ పార్టీ కాండిడేటు కెదురుగా

నామినేసనిచ్చేశాడు. తరవాతేం చేశాడనుకున్నావు? ఆ రాత్రి జంతర్ మంతర్ పార్టీ వాళ్ళు పెచారానికొ స్తారని తెలిసి, మన ఊళ్ళో కనపడినాడికల్లా సారా మంచినీళ్ళలా పట్టించేశాడు. నువ్వు నమ్మవుగానొరే, అంతకుముందు ఎప్పుడూ తాగనోళ్ళు కూడా ఆ ఏళ తాగేశారు. ఆ పార్టీ వోళ్ళు వచ్చి మీ ఓటు మాకె య్యండన్నారు. అప్పుడీళ్ళంతా మత్తులో వున్నారు. 'మాకేటి తెల్దు. మా ఎల్లయ్య బాబు ఏం చెప్తే అదే చేస్తాం' అన్నారు. ఆళ్ళకి గుండె జారిపోనాది. ఎల్లయ్య దగ్గరకు లగెత్తుకెళ్ళారు. ఈళ్ళొత్తారని ఆడికి తెల్సుగదా! ఆడు కొండెక్కేసాడు. 'నే సస్తే దిగను. నేను పెజాసేవ సేసేయాల' అన్నాడు. ఇంక ఆలస్యం చేస్తే ప్రమాదమని, ఆళ్ళు బేరంలోకి దిగారు. మనోడు బేరం సెటిల్ చేసుకుని, అదుచ్చు కుని తిన్నగా అయిద్రాబాద్ ఎళ్ళాడు. ఎళ్ళి, అక్కడేం చేశాడో తెల్సా? సినేమా పత్రికలోళ్ళని, టీవీల వాళ్ళనీ పిల్చి, 'నేనిప్పుడో బెమ్మాండమైన తెలుగు సినిమా తీస్తాను. అదంతా ఆంధ్రలోనే సూటింగు' అని చెప్పాడు. ఆ తరవాత, అప్పటి దాకా సినేమా చాన్సు రాక, ఎర్రిమొగాలేసి కూచున్న ఎదవలందర్నీ పోగేసి, ఓ పిచ్చరు నాగేసి, 'అచ్చోసి ఒదిలాడు' (సినేమా మూడొంతులయ్యాక డబ్బులైపోతే, అయినంతవరకూ రిలీజు చేసేశా డు). ముందు కొంతమంది చూశారు. అర్ధం కాలేదు. అందుకని మళ్ళీ చూశారు. అర్ధమయినట్ట నిపించాక, ఇదేదో 'ఎరైటీ' లాగుందని మళ్ళీమళ్ళీ చూశారు. ఆ సినేమా రెండొందరోజులాడింది. ఇంక బాగోదని, స్టేట్లో ఒకటి, సెంటర్లో ఒకటి అవా ర్డులిచ్చారు. ఆస్కారుకు పంపమని మేధావు లందరూ చెప్తే 'ఎందుకొచ్చిన గొడవ'ని వద్దనేశా డు..."

ఇంతలో చుట్ట ఆరిపోయింది. భుజంగం ఆ ప్రయత్నంలో పడ్డాడు.

"ఆడబ్బెట్టి, ఇంకో సినేమా తీశాడా?" అని భూషణం అడిగాడు. చుట్ట వెలిగింది.... "అది బుద్ధి లేనెదవలు చేసే పని. ఆడు ఆ డబ్బుచ్చుకుని తిన్నగా మనూరొచ్చేశాడు. పాలిటిక్సు, సినిమా అయిపోయాక, ఇంకే యాపారం వుంటుంది చెప్పు – సారాయాపారం తప్ప. ఇదివరకాడికి ఒక్క టీకొ ట్టుండేది. ఇప్పుడు స్టేటుకంతా సప్లయి ఆడిదే కదా! నాటుసారా నుండి సీమ సరుకు దాకా. ఆ తరువాత, డబ్బులెక్కువైపోయి ఏం చేసుకోవాలో తెలీక 'టె లుగు వెలుగు' అనే టీవీ ఛానల్ మొదలెట్టాడు – అమెరికా వెళ్ళాక 'టెలుగు కల్చరు' మీద మమకా రాన్ని విపరీతంగా పెంచేసుకున్న ఆంధ్రులకోసం. అందులో కూరపోపు నుండి కూచిపూడి దాకా, ఆవ కాయ నుండి అన్నమాచార్య దాకా, అన్నీ 'అచ్చటె లుగు' ప్రోగ్రాములే''... అని ఆగాడు భుజంగం.

"ఇంతకీ, ఎల్లయ్య చేసిన పెజాసేవ ఏంటిట?" – భూషణం ధర్మసందేహం.

"ఇదేటిది! ఎదవ కొశ్చను. ఎనకటికి నీలాటోడే, సినిమా చూస్తూ మధ్యలో పక్కోడ్నడిగాట్ట – 'ఈరో గాడేటి సేసినాడు. ఈరోయినాడ్నట్టుకు తిరుగు తోందని' – అలాగుంది. ఎల్లయ్యగాడు చెయ్యకపోడవేంటి? జంతర్‌మంతర్ పార్టీ ఎమ్మెల్లే చేసిన పెజాసేవ మనోడి చలవే కదా! మంచి సినే మాకోసం పడిగాపులు గాచే 'పిచ్చకలోకం' కోరిక తీర్చాడు. అది పెజాసేవ కాదా! మరి, దేశమంతటా అమ్మురుతం లాంటి సారా సప్లయి చేస్తున్నాడు. అది పెజాసేవ కదా! ఇంకా, అమెరికా ఇళ్ళల్లో టెలు గును వెలిగించేస్తున్నాడు. అంతకన్నా ఏంకావాలి?"

"అందుకే కదా మావా, బాగుపడాలంటే సినిమా తియ్యాలని నేనెప్పుడూ అంటాను" – అన్నాడు భూషణం.

"మరి నువ్వలాగనుకుంటే, సినేమా తీసి చిప్ప చేతికుచ్చుకున్న జోగినాదం కత చెప్తా యిను" – అంటూ భుజంగం ఇంకో కత మొదలెట్టాడు.

"... శాన్నాళ్ళ కిందట జోగినాదం అని మనూర్లో వుండేవోడు. ఆడు ఎప్పుడూ దేశసేవలో మునిగి (మరిగి) ఉండేవోడు. ఆడికున్నాస్తికి లెక్కలేదు. ఓరోజు, ఆడికేం పోయేకాలం బుద్ధిపుట్టిందో, ఆస్తంతా అమ్మి 'కాష్' చేసేసుకున్నాడు. పెళ్ళాం బిడ్డల్ని ఒదిలేశాడు (ఆళ్ళనీ అమ్మేవోడే, కానీ, తర వాతెందుకేనా పనికొస్తారని అమ్మలేదు). ఆ డబ్బుతో ముంబాయి వెళ్ళాడు. అక్కడ ఏం చేశాడ నుకున్నావు? ముగ్గురు ఈరోలు, నలుగురు ఈరో యిన్లు (మరి, డాన్సర్లమాట నన్నడొక్కొరే) – ఇంత మందినీ పెట్టి, పిచ్చరొకటి తీశాడు. ఈరోజు సూటింగు పారిస్‌లో చేస్తే, రేపు స్విట్జర్లాండులో చేసేవోడు. చిత్రమేటంటే, అందులో ఒక్క ఆడదా నికీ గుడ్డ సరిగ్గా కట్టలేదు. ('అందులో, ఈరోయిను చీర ఎన్నిసార్లు కట్టిందీ' అని ఆ తర్వాత పోటీ కూడా ఎట్టారు) – సరే! తీశాడా! తీసి, సెన్సారోళ్ళ దగ్గర కట్టుకెళ్ళాడు. ఆళ్ళు కట్ చేయగా మిగిలిందేటనుకు న్నావు? – టైటిల్స్, ఇంటర్వెల్, శుభం. లబోదిబో మంటూ మనోడు మళ్ళీ సూటింగు చేశాడు. ఈడు పది రీళ్ళు తీస్తే, ఆళ్ళు ఐదు రీళ్ళు కట్ చేసేవోరు. ఎలాగైతేనేం, సినేమా తీసి రిలీజు చేశాడు. మోర్నింగు షో టాక్ ఇన్న తరవాత, ఆ సినిమా చూస్తే కానీ ఇంకే సినిమాకి వెళ్ళకూడదనుకున్నారు కుర్రోళ్ళు. అది చూశాక్కానీ, ఆఫీసులకెళ్ళకూడదను కున్నారు పెద్దోళ్ళు. అది చూస్తే కానీ, ఇంకేపనీ చెయ్యకూడదనుకున్నారు ఆడోళ్ళు. విడియో కేసెట్లు అప్పడాల్లా అమ్ముడైపోతున్నాయి. ఇలా రెండు రోజులు జరిగింది. మూడో రోజు ఏట్టైందనుకు న్నావు? మన కల్చరు 'మందుగలిసి' పోతోందని గుండెలు బాదుకునే వాళ్ళందరు కలసి, టాకీసులు అంటించి, నానా గొడవ చేస్తే పోలీసోళ్ళొచ్చి, డబ్బాలు, కేసెట్లు అన్నీ పట్టుకుపో యారు. మనోడు లబోదిబోమ న్నాడు. కోర్టులో కేసెట్టడనికి, చేతిలో పైసా లేదు. మనూరొచ్చేశా డు".

"పాపం! తరవాత ఏవయ్యాడు?" – భూషణం జాలిపడ్డాడు.

"ఏటీ కానేదు. బాగా డబ్బున్న ఈరో, మొదట అరగంటలో బీదోడ యిపోయి, చివర అరగంట దాకా బాదలు పడిపోతాడు చూడు (డూ యెట్లు పాడ్డంలాంటివి కాదొరే) – ఆ బాదలన్నీ ఓ నెల పడ్డాడు. 'పాపం!' అనుకున్నారంతా. కానీ, నెలరోజుల తరవాత ఆడేటి చేసాడనుకున్నావు? జోగినాదం కాస్తా 'జైజైబాబా' అయిపోయాడు. దాన్తో, ఆడు మళ్ళీ బాగుపడ్డాడు. మినిట్టర్లు కూడా ఆడి సలహాకోసం వస్తుంటారు. అమెరికాలో బ్రాంచి కూడా ఎట్టేశాడు. ఆడు చాలా ఐక్లాసు బాబా అనుకో"

"దేనికైనా బుర్రుండాలి మావా!"

భుజంగం భళ్ళున నవ్వాడు – "మనకి బుర్రుండడం కాదు ఎర్రి నాగన్నా. మన చుట్టుపక్క లోళ్ళకి బుర్ర లేపోతే మన బుర్ర టూబులైట్‌లా ఎలి గిపోద్ది. అసలిలాంటి 'తియరీ' ఏదో సైన్సులో వుందని మొన్న మా అమ్మాయందే".

ఇంతలో సెల్‌ఫోన్ మోగింది – 'సారేజహాసే అచ్ఛా' మ్యూజిక్‌తో ఫోనులో మాట్లాడాక, భుజంగం ముఖంలో దిగులు చూసి, 'ఎక్కడ నుండి?' అడిగాడు భూషణం.

"ఇంకెవరు? మావాడే. అమెరికా నుండి. వీడి వరస చూస్తుంటే, నాకు చాలా బెంగగా ఉంది. అక్కడ చదువుకుని, తిరిగొచ్చి, ఏ మినిట్టరో అవుతా డని నేను కలలు కంటే, ఇక్కడకు తిరిగి రానంటు న్నాడు. 'మన దేశాన్ని ఎవరూ బాగుచేయలేరు. అక్కడ నేను బతకలేను' అంటాడు. అందుకే అన్నారు – 'గోరుముద్దల నాడు బిడ్డలు కాని, బీరు బుడ్డీలనాడు బిడ్డలా' అని. మా తాత ముత్తాత లందరూ దేశభక్తులే. మా యింటావంటా లేని బుద్ధులొచ్చాయి వీడికి. ఈడేదో కొంపలు ముంచేట్టు న్నాడు".

"ఆ! ఏదో చిన్నతనం మావా! ఓసారి ఇక్కడకు వచ్చి, వేషం మార్చి, నీ లైనులో పడ్డాడంటే, బాగు పడ్డం ఎంతసేపు? అయినా ఏ కుర్చీ మీద ఎవరి పేరు ఎప్పుడు రాసుందో, ఏ సినిమాకి ఏ అవార్డు వస్తుందో ఎవరికి తెలుసు? అంతా 'పైవాడి' దయ. చూస్తూండు. మీవాడు నిన్ను మించిపోయి, నీపేరు నిలబెడతాడు. నువ్వేం కంగారుపడకు. ఇక నే వస్తా" – అంటూ లేచాడు భూషణం.

★



## కెమెరా ఫోన్

మొబైల్ ఫోన్ల తయారీలో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన బెన్ క్యూ (Benq) కంపెనీ మరో చిప్ ముందుకేసి కెమెరా కం మొబైల్ ఫోన్‌ను తయారు చేసింది. 128X128 మి.మీ స్క్రీన్‌తో ఉండే ఈ కెమెరా నుంచి 65కె ఫొటోలు తీయవచ్చు.కొత్త 3D ఫేస్ మార్ఫిన్ టెక్నాలజీ గల ఈ కెమెరా ఫోన్‌కు గల ఇతర సౌకర్యాల గురించి ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. గ్రాఫిక్స్ చేయవచ్చు. ఇతర అన్ని మొబైల్ ఫోన్లలో వలే దీని నుంచి కూడా ఎస్.ఎం.ఎస్.లు పంపుకోవచ్చు. ఎక్కడికైనా ఫోన్ చేసుకోవచ్చు. అంతర్జాతీయ రోమింగ్ ఉంది.